# కస్తూరీ తిలకం

- డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య
మాజీ ఛైర్మన్, అధికార భాషా కమీషన్

## 1

డా॥ ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మ, మధురకవి స్వర్గీయ నాళం కృష్ణారావుగారి ఔరసదుహిత-మాత్రమేగాక మానస పుత్రిక గూడ. ఈమె రక్తనాళాలలో సాహితీ ప్రతిభ-అనువంశికంగా స్రవించుచున్నది. అనటానికి నిర్వికల్ప నిదర్శనం-ఈమె పుత్రిక శ్రీమతి సుహాసిని-ఏలూరు మహిళా కళాశాలలో ఉపన్యాసకురాలు-సంగీత సాహిత్యాలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా జీవించే విదుషీమణి. ఈమె కుమార రత్నాలు విదేశాలలో మేధావులలో మేలుబంతులుగా ప్రయోజకులై జీవించుచున్నారు. నాళంవారి ధర్మసత్రాలు ఆంధ్రదేశంలో రాజ మహేంద్రవరంలో పలుచోట్ల ఉన్నాయి. ఆంధ్రదేశంలో వణిక్ప్రభువులు పలువురు దాన ధర్మదయాపారీణులు. పుట్టినిల్లేగాక,శ్రీమతి లక్ష్మీకాన్తమ్మ మెట్టినిల్లు. ఊటుకూరి వారి వంశం గూడ సుప్రసిద్ధ వైశ్య శిఖామణుల వంగడం. ఈమె అభిజాత్యవతి. అదృష్టవంతురాలు.

## 2

ఆంధ్ర కవయిత్రుల చరిత్ర-ఈమెకు పేరు తెచ్చిపెట్టిన ఉద్గ్రంథం. ఈమె పుట్టి పెరిగిన వాతావరణం-రాజమహేంద్రవరంలోనే వీరేశలింగంగారి కవుల చరిత్ర రాశారు-అందుకు దోహదం చేసింది. ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో ఈమెకు వీరేశలింగంగారి ప్రక్కసీటు లభించింది. ఆంధ్ర యావత్‌కళాశాల అంతేవాసినిగా లక్ష్మీకాన్తమ్మ ఆంధ్ర రచయిత్రుల చరిత్ర రాయటానికి ఉత్తమోత్తమ అధికారిణి.

డా॥ లక్ష్మీకాన్తమ్మగారితో నాకు గల ప్రత్యక్ష పరిచయం మిక్కిలి తక్కువ. సంపన్న వైశ్య సహృదయుల ఆదరాభిమానాలు నాకు అనుభవామ్రేడితాలు. ఏలూరులో కొత్తమాసు అయ్యన్న - గుడిమెట్ల శేషగిరిరావు నా బాల్య మిత్రులు నాపై - నా యోగ్యతకు మించిన ఆదరాభిమానాలు వర్షించారు. పశ్చిమ గోదావరి పిప్పర వణిక్ప్రభువులు తుమ్మలపల్లి వీరభద్రరావు - తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తినాకు ధన కనకవస్తువాహన సత్కారాలు సమకూర్చి కస్తూరీ ప్రదానం చేసి సన్మానించిన సహృదయ చక్రవర్తులు. డా॥ లక్ష్మీకాన్తమ్మగారితో నాకు ప్రథమ పరిచయం తుమ్మలపల్లివారి ఇంటిలో జరిగిన పెండ్లిపందిరిలో. సనాతన భారతీయ సంస్కృతికి-తమహృదయాలలో వెన్నెల కోవెలలు కట్టుకుని ఆరాధించే సంపన్న వైశ్య కుటుంబాలలో జరిగే వివాహాలు-ప్రాయికంగా సాహితీ యజ్ఞవాటికలు. విదుషీ మణిగ

డా॥ లక్ష్మీకాన్తమ్మగారికి ఆనాడు ఘనసన్మానం జరిగింది. నాకు కూడా జరిగిన సత్కారం - ప్రహస్త ప్రాయమైన అధిక పాఠంగా ఆనాడు ఆమె భావించకుండా నన్ను ఆమె ఆదరించటం ఆమె ఔదార్య విశేషం. ఈనాడు తన జీవిత చరిత్రకు తిలకం తీర్చిదిద్దమని ఆమె నన్నుకోరటం నాకు ఆనంద ప్రదమేగాని ఆశ్చర్యదాయకం కాదు.

"సాహితీరుద్రమ" ఊటుకూరి లక్ష్మీకాన్తమ్మగారి స్వీయ జీవిత చరిత్ర మాత్రమేగాదు. ఎన్నో ఉత్తమ కావ్యాలు రాసిన ఒక తెలుగాడపడుచు అంతరంగిక కుటుంబగాథ కాదు. అర్థ శతాబ్దికి పైగా-ఆంధ్రదేశసామాజిక చరిత్ర. సమకాలీన సాహితీ జగత్తులో చిరస్మరణీయమైన పాత్రలు ధరించిన మహామణులు ఎందరో ఈ గ్రంథంలో కన్పిస్తారు. డా॥ లక్ష్మీకాన్తమ్మగారు - ఈ గ్రంథ రచన చేసి - ఆంధ్ర సాహిత్యానికేగాక ఆంధ్రదేశ చరిత్రకుకూడా ఎనలేని సేవచేశారు. "సాహితీ రుద్రమ" అనే బిరుదు ఈమెకు అక్షరాల సార్థకం. కాకతీయ యుగంలో రాణిరుద్రమ కత్తి - గాంధీ యుగంలో జన్మించిన కలంగా పరిణమించినట్లు అభిజ్ఞులు భావించటం సమంజసం. సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలినిగా డా॥ లక్ష్మీకాన్తమ్మగారు పేరు తెచ్చుకోటం ఆశ్చర్యకరమైన అంశం కాదు. ఆమెతో పోటీపడే రచయిత్రులు-యావదాంధ్రంలో పలువురు ఉద్భవించవచ్చు. అయితే ఆమె వంటి ఉపన్యాసకురాలు బహుశః కొన్ని తరాలు గడిస్తేగాని ఆంధ్రభూమిలో అవతరించకపోవచ్చు.

జలపాత సదృశమైన అనర్గళ వాగ్ధోరణితో ఆమె ప్రసంగించటం విన్నవారు ఆశ్చర్య చకితులు. కావటం కద్దు. లలనాలావణ్యం మూర్తీభవించిన సుకుమార సుందర శిల్ప విగ్రహం ఆమెది. ఈమె గళంలో ఒకపరి వాణి వేయితంత్రుల వీణ మ్రోగుతుంది. మరొకమారు లీలాతాండవలోలుడైనా నటరాజు చేతిలోని ఢక్కా నినాదం వినిపిస్తుంది. ఒకసారి "చారు పుంస్కోకిలాప సమ్మోదయగు" సాహిత్యో పన్యాసం వెలువడుతుంది. ఎక్కడనుండి వచ్చింది ? ఈమెకు ఈ అత్యద్భుతమైన ఆ ప్రసంగశక్తి? ఈమె పుట్టి పెరిగింది గాంధీయుగంలో. మహాత్ముడు పూరించిన స్వాతంత్ర్య శంఖారావం భారతదేశంలో దశదిశల మారు మ్రోగిన సమయం అది. స్వాతంత్రోద్యమంలో హిమాలయాలనీడ కన్యాకుమారిపై పడింది సహజ కవచకుండలాలతో అలనాడు కర్ణుడు ఉదయించినట్లు - గాంధీయుగంలో దేశ భక్తులు సహజమైన కంఠాలతో అవతరించారు. ఆ దేశభక్తియుగం డా॥ లక్ష్మీకాన్తమ్మగారి గొంతులో సరిగమపదనిసలు సమకూర్చుకున్నది.

*జంకు గొంకులేక-ఢంకా భజాయించి*

*పాడగలదు-మాటలాడగలదు;*

పాల కడలి పొంగు-శ్రీలక్ష్మీకాన్తమ్మ
గొంతులోక దిగ్ దిగంత మెరసి.

డా॥ లక్ష్మీకాన్తమ్మ - ఆంధ్ర కవయిత్రుల చరిత్ర రాసిన విదుషీమణి మాత్రమే గాదు. ఆమె నిలువెల్ల కవితయే. భర్త - హయగ్రీవగుప్తగారు మరణించినపుడు ఈమె రాసిన కవిత - విన్నప్పుడు నా కన్నులు చెమ్మగిల్లినవి.

"కవిత అనిన వేడి కన్నీటి బొట్టులే
ఆ శ్లోకమయ్యె ఆమె వోకమెల్ల"

ఈమె ప్రపంచ పర్యటన చేసివచ్చిన సాహితీయాత్రికురాలు. ఇంగ్లీషు వచ్చి వుంటే ఈమె అమెరికా వాసులను వివేకానంద మహర్షివలె ఉర్రూతలూగించి యుండేది. ఈమె సనాతన భారతీయ సంస్కృతికి సజీవ ప్రతీక.

ఆమె - సాహితీ రుద్రమ ఆంధ్రదేశంలో అర్థ శతాబ్దానికి పైగా సాగిన సామాజిక - రాజకీయ - సాహితీ చరిత్ర - ప్రతిఫలించే అద్దాలమేడ.

## బహుముఖ ప్రజ్ఞాశాలి

- తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి

న్నన పార్యుని నుడిలోని నవకమెరిగి,
ఒడలి, తిక్కన్ననుడిలోని నడకనేర్చి,
యీ కలీ మణిపుట్టిన యింటి జిగికి,
మెట్టినింటి వన్నియుకును మెరుగుపెట్టె"

కవితయందెకాదు, కమనీయ సంస్కృతి
రక్షయందు, గాన దీక్షయందు,
బహుముఖ ప్రసంగ పరిపాటియదీమె
వీనుమిగిలె, నాంధ్ర విశ్వమునకు